ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



చీడిపూడిలంకలో వరదకు దెబ్బతిన్న పసుపు తోట



వరదకు దెబ్బతిన్న మల్బరీ తోట

నష్టపరిహారంపై నీలినీడలు !

- జాబితాలో కనిపించని లంక భూముల రైతుల వివరాలు
- పొంతన లేని సమాధానాలు చెబుతున్న అధికారులు
- కనీస ఊరటకు దూరమవుతామని రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

చల్లపల్లి మండలం వెలువోలుక శివారు చీడేపూడిలంకలో వెలువోలకు చెందిన పెనమత్స ప్రభాకరరావు రెండు ఎకరాల్లో, కోలవెంటి రాజారావు ఎకరం విస్తీర్ణంలో మల్బరీ తోట సాగు చేశారు. పెనుమత్స కృష్ణారావు రెండెకరాల్లో పసుపుతోట, ఈపూరి దుర్గారావు ఎకరం విస్తీర్ణంలో వంగ, బీర తోటలు వేశారు. ఈ లంకలో 88 ఎకరాల భూముల్లో మహాత్మాజీ లేబర్ ఫీల్డ్ కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన 130 మంది చిన్న సన్నకారు రైతులు ఉద్యాన పంటలు సాగు చేశారు. కృష్ణానదికి వచ్చిన భారీ వరదలో ఈ వ్యవసాయ భూములు పూర్తిగా ముంపుకు గురయ్యాయి. పంటలన్నీ దెబ్బతిన్నాయి. మల్బరీ పట్టు పరుగులు పెంపకం, అరటి, పసుపు సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.50 వేలు, కంద సాగు చేసిన రైతులు రూ.లక్ష, కూరగాయల రైతులు రూ.40 వేలు నష్టపోయారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కొంత మేర ఊరట ఇస్తుందని ఆశించారు. అయితే ఎన్యూమరేషన్ అనంతరం సోషల్ ఆడిట్‌లో ఈ లంకలో భూముల వివరాలు జాబితాలు కనిపించలేదు. ఇక్కడే భూముల్లోనే కాదు.. మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం లంక ప్రాంత భూములకు చెందిన కొందరి రైతులు పేర్లు ఎన్యుమరేషన్ జాబితాలో కనిపించడం లేదని చెబుతున్నారు. పంట నష్టపరిహారంపై నీలి నీడలు కమ్ముకోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

పొంతన లేని సమాధానాలు

తమ భూముల వివరాలు ఎన్యూమరేషన్ జాబితాలో కనిపించడం లేదని రైతులు మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారులను కలిశారు. ఈ లంక భూములను ఎన్యుమరేషన్ పూర్తి చేసి వ్యవసాయ అధికారులకు ఇచ్చామని చెపుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం రెవెన్యూ కార్యాలయం నుంచి తమకు డేటా అందలేదని, మల్బరీ పంట సాగు వివరాల (మిగతా 2లో)

కళాశాల బస్సులో మంటలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి కేతనకొండ రోడ్డులో వంతెనపై గొల్లపూడి ఎస్ఆర్ కళాశాల బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బస్సు ఇంజన్ నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించడంతో డ్రైవర్ బస్సు నుండి దూకేశాడు. బస్సు పూర్తిగా దగ్ధమైంది. కళాశాల నుంచి విద్యార్థులను దింపి వస్తుండగా ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. వరదల్లో మునిగిన బస్సుకు మరమ్మతులు చేసి శుక్రవారం బయటకు తీసుకురావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి ఉండవచ్చని భావిస్తున్నారు.



సమన్వయంతో దసరా ఉత్సవాల ఏర్పాట్లు

సమన్వయ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సృజన



ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 3వ తేదీ నుండి నిర్వహించనున్న దసరా శరనవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. సజన సూచించారు. దసరా మహోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ జి.సృజన పోలీసు కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్ రామారావు మునిసిపల్, రెవిన్యూ, పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులుతో శుక్రవారం బ్రాహ్మణ వీధి జమ్మిదొడ్డి కార్యాలయం నందు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి యేటా దసరా ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాదిగా ప్రజలు తరలి వస్తారన్నారు. గత అనుభవాలను దష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ అధికారులతో జిల్లాస్థాయి అధికారులు సమన్వయం ఉండి అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్నానం ఘాట్లు, (మిగతా 2లో)

విజ్ఞాన కేంద్రాల ఏర్పాటులో

ఏచూరి పాత్ర కీలకం

ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు

ప్రజాశక్తి-విజయవాడ: విజ్ఞాన కేంద్రాల ఏర్పాటులో ఏచూరి కీలకపాత్ర పోషించారని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ట్రస్టు చైర్మన్ పి.మధు అన్నారు. ఎంబివికె ఆధ్వర్యాన శుక్రవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఎంబివికె ఇన్చార్జి బి.ఆర్.తులసీరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి ట్రస్టు చైర్మన్ పి.మధు, ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 2016లో ఎంబివికె ఏచూరి చేతుల మీదుగానే ప్రారంభమైందని గుర్తుచేశారు. మతోన్మాద భావజాలం పెరుగుతున్న నేపథ్యంలో విజ్ఞాన కేంద్రాల ప్రాముఖ్యతను గుర్తించి వాటి ఏర్పాటుకు బాటలు వేశారన్నారు. భిన్న మతాలు, కులాలు, భాషలు గల దేశంలో లౌకిక భావాలు, వాటిని అనుసరించే పార్టీల మధ్య ఐక్యతకు విశేష కృషి చేశారన్నారు. ఎంబివికె ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు మాట్లాడతూ మేధావులు చాలా మంది ఉంటారని, కానీ ప్రజలను ప్రభావితం చేసే వారు కొంతమందే ఉంటారని అన్నారు. అటువంటి వారిలో ఏచూరి ఒకరన్నారు. ఆయన ప్రజా నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బాధ్యులు కె.స్వరూపరాణి, యు.వి.రామరాజు, టి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు. పిఎన్ఎం నాయకులు అనిల్ బృందం విప్లవ గేయాలు ఆలపించింది.



ఎంబివికెలో జరిగిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ట్రస్టు చైర్మన్ పి.మధు, కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు



బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బిబిఎ అధ్యక్షులు కొత్తా చంద్రమౌళి వార్త 2లో

53 వేల ఇళ్లకు నష్టం

- మంత్రి నారాయణ
- 36,923 ద్విచక్ర వాహనాలు, 2 వేల కార్లు దెబ్బతిన్నాయి
- 26,545 టివిలు, 31 వేలకుపైగా ఫ్రిజ్‌లు, 20 వేలకుపైగా వాషింగ్ మెషీన్లకు నష్టం

ప్రజాశక్తి-విజయవాడ: వరదల వల్ల నగరంలోని 32 వార్డులతోపాటు నగరం చుట్టుప్రక్కల ప్రాంతాల్లో కూడా నష్టం సంభవించిందని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలు, జరిగిన నష్టాన్ని మీడియాకు వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ శనివారంనాటికి పూర్తవుతుందన్నారు. చాలా మంది ఇళ్లల్లో ఫర్నీచర్ దెబ్బతినిపోయిందని, బెడ్లు, పిల్లోలు పూర్తిగా పాడయ్యాయన్నారు. ఇప్పటికీ 61, 63, 64 వార్డుల్లోని 10 వీధులు, 1500 ఇళ్లు నీట మునిగి ఉన్నాయన్నారు. నాలుగు చక్రాల వాహనాలు , టూ వీలర్లు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రతి ఇంట్లో జరిగిన వరద నష్టాన్ని అంచనా వేశామని, కొంతమంది ఇళ్లల్లో లేరని తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లు, నీళ్లలో ఉండిపోయిన ఇళ్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. 53,399 ఇళ్లు నీళ్లలో ఉండిపోయాయని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు 36,923 ద్విచక్ర వాహనాలు, రెండు వేల కార్లు, ఇతర వాహనాలు దెబ్బతిన్నాయన్నారు. దాదాపు 26,545 టీవీలు, 31 వేలకుపైగా ఫ్రిజ్‌లు, 20 వేలకుపైగా వాషింగ్ మెషీన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5 వేల కోట్ల నష్టం జరిగిందన్నారు.

ప్రజాప్రతినిధులు, విఎంసి అధికారులు ఏరీ?

సిపిఎం నేతల ఎదుట వరద బాధితుల ఆవేదన

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద ప్రాంతాలైన అజిత్ సింగ్ నగర్, పిఎన్ టి కాలనీ, షాదీ ఖానా, సుందరయ్య రోడ్, శివాలయం సెంటర్, రాజీవ్ నగర్, రాధానగర్, వాంబే కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం సిపిఎం నేతలు పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు ప్రజలను కలుసుకుని వారి కష్టాలు తెలుసుకున్నారు. ఆరు చోట్ల కొనసాగుతున్న ప్రజా సంఘాలలు, సిపిఎం భోజన కేంద్రాలను పరిశీలించారు. వరద బురద తగ్గినా, కష్టాలు తగ్గలేదని బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గత 13 రోజుల నుండి శాసనసభ్యులు, నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలు నిర్వహించడంలో పూర్తిగా విఫలమయ్యారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ మెజారిటీలతో గెలిపిస్తే, నేడు మొహం చాటేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రితో తప్ప ప్రజలకు ప్రజా ప్రతినిధులు కనిపించరా అని ప్రశ్నించారు. ఇప్పటికీ ఇళ్లు శుభ్రం చేసుకోలేదని, మంచినీటి ట్యాంకర్లు కొన్ని ప్రాంతాలు రావటంలేదని, గ్యాస్ స్టవ్‌లు వెలగక వంట చేసుకోవడం కష్టంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం కష్టించి సంపాదించుకున్న ఆస్తులు, సామాగ్రి సర్వస్వం కోల్పోయామని కన్నీటి పర్యంతమయ్యారు. మోటారు వాహనాలు, కార్లు, ఇతర వాహనాల ఇన్సూరెన్స్ గురించి ప్రభుత్వం చెప్పిన హామీలు అమలుకు నోచుకోవటంలేదని, పాత వాహనాలు అప్పజెప్పండి, ఎంతో కొంత ఇస్తాం, కొత్త వాహనాలు కొనుక్కోండి అని కంపెనీలు సలహా ఇస్తున్నాయని విమర్శించారు. కొందరికి సెప్టెంబర్ పెన్షన్లు అందడంలేదన్నారు. టివిలు, ఫ్రిజ్లు, వాహనాలు, మోటార్లు ఇతర ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు రిపేర్ల గురించి ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోవటంలేదని ఆవేదన చెందారు. ఈపర్యటనలో సిపిఎం నేతలు బి రమణరావు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, కె.కళ్యాణ్, కె.శ్రీదేవి, నాగేశ్వరరావు, రాము, సిహెచ్ శ్రీనివాస్, ఎస్కే పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

తూనికుంట్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: విభిన్న రంగాల్లో కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. అమెరికాలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ అమెరికా నుంచి తూనికుంట్ల గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

మొదటిపేజీ తరువాయి

నష్టపరిహారంపై నీలినీడలు !

నమోదును పట్టు పరిశ్రమ శాఖ (సెరీ కల్చర్) అధికారులు నమోదు చేయాలని చెబుతున్నారు. అధికారుల మధ్య సమన్వయ లేమి పొంతన లేని సమాధానాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదలతో ఆర్థికంగా నిండా మునిగిన తమకు అధికారుల తీరుతో ప్రభుత్వ పరిహారం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

సమన్వయంతో దసరా ఉత్సవాల ఏర్పాట్లు

క్యూ లైన్‌లు, కౌంటర్లు, ఇతర రద్దీ మరియు ముఖ్యమైన ప్రదేశాలలో నిరంతర నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో కె.ఎస్. రామారావు మాట్లాడుతూ దసరా నవరాత్రులలో శ్రీ అమ్మవారి చేసే అలంకారం గురించి వివరించారు. భక్తులకు త్వరితిగతిన అమ్మావారిదర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన ప్రదేశాలలో ప్రసాదం, కల్యాణకట్ట కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. స్నాన ఘాట్లు, త్రాగు నీరు, శానిటేషన్, సెక్యూరిటీ ఏర్పాట్లు, రద్దీకి అనుగుణంగా క్యూ లైన్ ఏర్పాట్లుపై ప్రత్యేక దష్టి పెట్టామని తెలిపారు. మునిసిపల్, పోలీస్, అగ్నిమాపక, వైద్య, రోడ్లు భవనాలు ఇరిగేషన్ మరియు ఇతర విభాగాల నుండి కావలసిన ఏర్పాట్లు తదితరాల గురించి చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ తమ విభాగాల వారు గత అనుభవాలు మరియు ప్రస్తుత పరిస్థితులు దష్ట్యా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఈనెల 16న క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాల అధికారులతో కలిసి పరిశీలన నిర్వహిస్తారని, అనంతరం సమీక్ష సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ డిసిపి గౌతమ్ శాలి, ట్రాఫిక్ డీసీపీ కష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ రామకష్ణ, ఆలయ ఈఈ లు కెవిఎస్ కోటేశ్వరరావు, లింగం రమ, డెప్యూటీ ఇఓ లీలా కుమార్, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఇంజినీరింగ్ అధికారులు, వన్‌టౌన్ ఏసిపి, సీఐ, ఎస్ఐ, అగ్నిమాపక, ఎలక్ట్రిసిటీ, డిఎంఓహెచ్, మునిసిపల్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బుడమేరు ఆక్రమణలపై నివేదికివ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

భవిష్యత్తులో బుడమేరు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ బుడమేరుకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో సర్వే, ల్యాండ్ రికార్డ్స్‌బీ ఇరిగేషన్, వీఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి సర్వే నంబర్లతో సహా ఆక్రమణలకు సంబంధించి పూర్తి నివేదిక సత్వరం సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. ఆక్రమణల గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సర్వే, భూ రికార్డులు, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల బుడమేరు పరీవాహక ప్రాంతంలో కురిసిన కుంభవృష్టితో ఊహించని విధంగా పెద్దఎత్తున దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో పరిసర లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం కావడంతో పాటు నగరంలోని రెండు లక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్రనష్టాన్ని చవిచూడటం జరిగిందన్నారు. సిఎం దాదాపు పది రోజులకు పైగా కలెక్టరేట్‌లోనే ఉండి సహాయసహకారాలు అందించారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ఆపరేషన్ బుడమేరును ప్రకటించారని, ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించిన నివేదికలను రూపొందించాల్సిన అవసరముందని అన్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్దమవుతోందన్నారు. ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నెంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసు, నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పది రోజులపాటు ముంపు బాధితులకు నిరంతరం సేవలు అందించడంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారని, అదేవిధంగా ఆ శాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగులు కూడా ముంపు బాధితులకు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అన్నారు.ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు మహిళా, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత అధికారుల సహకారంతో సమకూర్చిన నూతన వస్త్రాల కిట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆమె కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా చేతుల మీదుగా కూడా వస్త్రాల కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సజన మాట్లాడుతూ.. వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారానికి తోడు స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, వ్యాపారవేత్తలు తదితరులు ప్రజలను ఆదుకునేందుకు ముందుకొస్తున్నారన్నారు.వరద ముంపునకు గురైన నాటినుండి ఇప్పటివరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు బాధితులకు సేవలందించడంలో నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇదేవిధంగా ఆ శాఖ విశ్రాంత అధికారులు, ఉద్యోగులు ముందుకొచ్చి బాధితులకు తమ వంతు సహకారాన్ని అందించడం ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. ఇదే స్ఫూర్తితో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంతవరకు బాధితులకు సహాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు అందించిన సహకారంతో బాధితులకు ఒక్కో చీర, దుప్పటి, లుంగీ, టవల్, నైట్ డ్రెస్, శానిటరీ న్యాప్కిన్స్ లతో కూడిన రూ. లక్ష విలువైన కిట్లను 500 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

విరాళాలందించడం మంచి పరిణామం: కొల్లు

ప్రజాశక్తి-విజయవాడ: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాష్ట్రేతరులు కూడా ముందుకొచ్చి విరాళాల అందించడం మంచి పరిణామమని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో తెలిపారు.. వరద బాధితులకు పెద్ద ఎత్తున సోదర భావంతో విరాళాలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని ఇలాంటి వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నాం అన్నారు.అలుమ్ని సభ్యులు కలసి 65 వేలు చెక్ ను అందించడం జరిగింది..నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ సభ్యులు,వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మంత్రి గారిని కలిసి విరాళం అందించడం జరిగింది. మంత్రిని కలిసిన వారిలో తమిళనాడు కేడర్ ఐఏఎస్ సాహే మీనా, స్టీఫెన్ అనురాగ్ ప్రత్తిపాటి, డాక్టర్ ఎన్జీ నిహాల్, డాక్టర్ మనోజ్, సాహిల్ , డేవిడ్ దినకరన్ తదితరులు ఉన్నారు.

ఉపాధి, అటవీ హక్కుల చట్టాలకు ఏచూరి కృషి

బిబిఎ సభలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-విజయవాడ: ఉపాధి హామీ చట్టం, అటవీహక్కుల చట్టం వంటి చట్టాలు తీసుకురావడంలో ఏచూరి కృషి మరువలేనిదని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బిబిఎ) ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను నగరంలోని బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిబిఎ అధ్యక్ష కార్యదర్శులు కె.చంద్రమౌళి, రాజా, ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) కార్యనిర్వహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి.ఉమామహేశ్వర రావు, సీనియర్ న్యాయవాదులు వి.గురునాధం, చేకూరి శ్రీపతిరావు, కెవివి పరమేశ్వరరావు, నరహరిశెట్టి నరసింహారావు తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్లో సిపిఎం చేసిన వత్తిడితో యుపిఎ ప్రభుత్వం ఈ చట్టాలను తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ఇందులో ఏచూరి పాత్ర మరువలేనిదన్నారు. దేశంలో లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, విశాల శక్తుల సమీకరణకు, విశాల వేదికల ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని సామాన్యలకు సైతం అర్థమయ్యే రీతిలో చెప్పేవారన్నారు. ఏచూరి లాంటి సిద్ధాంత కర్త, గొప్ప నాయకుడి మరణం ఆయన అభిమానులందరినీ కలచివేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఐలు రాష్ట్ర నాయకులు సంపర శ్రీనివాసరావు, వి.రాజారత్నం, వి.కోటేశ్వరరావు, ఆలూరి సుధాకర రావు, వి.రామకష్ణ, బొమ్మసాని రవి, కోటబాబు, పెద్దసంఖ్యల న్యాయవాదులు పాల్గొని ఏచూరికి ఘన నివాళులర్పించారు.

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT JUDGE, KRISHNA, MACHILIPATNAM
I.A. 210/2021 IN I.A. 145/2020 IN I.A. 164/2019 IN O.S. 70/2018

Between :
Goli Sukanya ..... Petitioner / Plaintiff
Vs
Sangisetti Seetharavamma & others .... Respondents / Defendents

టు,
శ్రీమతి చలసాని వెంకటరమణ, భర్త : మహేంద్ర శేషగిరిరావు, డోర్ నెం. 2-231/1, కూచిపూడి, బార్లపూడి రోడ్డు, చంటిగారి మిల్లు సందు, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా.

పిటీషనరు తన ఫైనల్ డిక్రీ పిటీషన్ I.A. 164/2019లో వేరొక ఆస్థిని కలుపమని దాఖలు చేసిన పిటీషన్ I.A. 145/2020 లో మిమ్ములను పార్టీగా చేర్చమని దాఖలు చేసిన పిటీషన్ I.A. 210/2021లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందని కారణముగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు పంపుతున్నాను. కావున మీరు స్వయంగా గానీ లేక ప్లీడరుగారి ద్వారా గానీ పై కోర్టుకు ది. 18-9-2024 నాడు ఉదయం 10-30 గం.లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచవలయును. లేనిచో మీ పరోక్షమున మీకు వ్యతిరేకంగా ఆర్డరు జారీ చేసెదరు.

(బై ఆర్డర్)
వాయిదాతేది: 18-9-2024
మచిలీపట్నం.
ది. 8-9-2024

ఇట్లు
కె.సత్యనారాయణమూర్తి
పిటీషనరు / వాది తరపు ప్లీడరు.

IN THE COURT OF THE HON'BLE XIV ADDL. DISTRICT AND ADDL. FAMILY COURT JUDGE AT VIJAYAWADA
MHOP NO. 20/2024

Between:
Nandam Kamala .... Petitioner
AND
Nil .... Respondent

GENERAL NOTICE

పై నెంబరు పిటిషనర్ అయిన నందం కమల గారు తెలియజేయునది ఏమనగా... తన సోదరి పర్వతం రమాదేవి మరియు గంగాధరరావు గారి కుమారుడైన పర్వతం వెంకట సత్యసాయిరామ్ మానసిక వికలాంగుడు అయినందున అతనికి అనగా పర్వతం వెంకట సత్యసాయిరామ్ అతనికి మరియు తన యొక్క ఆస్తికి సంబంధించిన వాటిపై తనను గార్డియన్‌గా కోర్టు వారిని కోరుతూ చిన్నమ్మ (Maternal Aunt) పిటిషనర్‌గా గౌరవ న్యాయస్థానములో పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున గమనించగలరు. పర్వతం వెంకట సత్యసాయిరామ్ బ్యాంక్ ఖాతాలు మరియు అతని తల్లిదండ్రులు అయిన (లేటు పర్వతం రమా దేవి, లేటు పర్వతం గంగాధరరావు) వాళ్ళకు చెందిన బ్యాంకు ఖాతాలను పిటిషనర్ అజమాయిషీ చేసే విధంగా కోర్టులో పిటిషన్ దాఖలు చేయు చున్నారు. పై పిటిషన్‌లో అడిగిన కోర్టువారిని అడిగిన reliefకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ది.25-09-2024 ఉదయం గం.10.30 ని.లకు కోర్టు వారి ముందు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై వారి యొక్క అభ్యంతరములు తెలియజేయగలరు. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేదీ: 25-09-2024
మత్తి శ్యామ్, అడ్వకేట్
డోర్ నెం.30-9-7, ఏబి హోమ్స్, ఎఫ్ఎఫ్-2, నంబూరి వారి వీధి, దుర్గా అగ్రహారం, విజయవాడ-2. సెల్. 9297051666
విజయవాడ ది.13-09-2024

మహారాజశ్రీ బాపట్ల అదనపు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఐ.ఎ.నెం.4/2021 ఇన్ ఓ.యస్. వెం.4/2016.

1. డా॥ తిరువాయిపాటి వెంకయ్య (వాది) (డైడ్)
2. డా॥ తిరువాయిపాటి జానకీదేవి

(ప్రపోజ్డ్ 2వ వాది/యల్.ఆర్) .... పిటీషనర్లు

ఎదిరి

మెసర్స్ అగ్రిగోల్డ్ ఫారం ఎస్టేట్స్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్, అగ్రిగోల్డ్ హౌస్, డోర్ నెం.40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకరరావు వీధి, పాత రెవిన్యూ కాలనీ, లబ్బీపేట, యం.జి. రోడ్డు, విజయవాడ - 520 010, రిజిష్టరు కంపెనీ, రిప్రజెంటెడ్‌బై ఇట్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ.హెచ్.యస్. ప్రసాద్, s/o. లేటు ఎ.వి. అప్పారావు ...రెస్పాండెంట్/ప్రతివాది.

టు
మెసర్స్ అగ్రిగోల్డ్ ఫారం ఎస్టేట్స్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్, అగ్రిగోల్డ్ హౌస్, డోర్ నెం.40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకరరావు వీధి, పాత రెవిన్యూ కాలనీ, లబ్బీపేట, యం.జి. రోడ్డు, విజయవాడ - 520 010, రిజిష్టరు కంపెనీ, రిప్రజెంటెడ్ బై ఇట్స్ జాయింట్‌మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ.హెచ్.యస్. ప్రసాద్, S/o. లేటు ఎ.వి. అప్పారావు.

పై నంబరుగల యల్.ఆర్స్ పిటీషన్లో రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా సి.పి.సి. ఆర్డరు 22 రూలు 3 ప్రకారము నోటీసులు పంపించినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక అలక్ష్యము చేయుచున్నందున శ్రీకోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీచేయు నిమిత్తము ది. 04.10.2024 కి వాయిదావేసినారు. కావున మీరు ది.04.10.2024న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగాగాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపు కోవలయును. లేని యెడల శ్రీ కోర్టువారు విచారించి మీ పరోక్షమున సదరు పిటీషనును తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ పరచడమైనది.

వాయిదా తేది: 04.10.2024.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
పొన్నూరు,
తేది.13.09.2024.

ఇట్లు
యం.పి.ఆర్.వి. ప్రసాద్,
పిటీషనర్ల తరపు అడ్వకేట్, పొన్నూరు,
సెల్ : 98480 12186.

ఏచూరి మృతి ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు • సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల ఘన నివాళి



మచిలీపట్నంలో మాట్లాడుతున్న వై.నరసింహారావు

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : సీతారాం ఏచూరి మరణం భారత రాజకీయాలతోపాటు కమ్యూనిస్టు, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం కష్ణా జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. ఏచూరి సంతాప సభ శుక్రవారం సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా ఉండి విద్యార్థి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంలో ఏచూరి పాత్ర అమోఘమన్నారు. అదేవిధంగా జే ఎన్ యు ని, విప్లవ కేంద్రంగా మార్చడంలో ఏచూరి పాత్ర ఎంతో ఉందన్నారు. ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త పై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియంత్రత్వానికి వ్యతిరేకంగా, బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసే విధంగా పార్టీని నిర్మాణం చేసారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు యస్ ధనుంజయరావు, కొడాలి శర్మ సభకు అధ్యక్షత వహించిన సంతాప సభలో సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరావు, పార్టీ నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యాం , జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, లు మాట్లాడిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎండి యూనస్ టి చంద్రపాల్, రావి వెంకట్రావు, పరస లక్ష్మి, సిహెచ్ జయ రావు ఐద్వా మచిలీపట్నం నగర కార్యదర్శి కే సుజాత, అధ్యక్షులు సిహెచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.తొలుత సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు.

అలాగే మచిలీపట్నం దేశాయిపేట శాఖ ఆధ్వర్యంలో ఏచూరి మృతికి నివాళులర్పించారు. భవన నిర్మాణ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి గోపాలరావు, దేశాయిపేట పార్టీ శాఖ సభ్యులు వివి రమణ రావు ,దేశాయిపేట పార్టీ శాఖ సభ్యులు అంకబాబు ,సిఐటియు జిల్లా కమిటీ కోశాధికారి. బి సుబ్రహ్మణ్యాం సిఐటియు మండల కార్యదర్శి సి హెచ్ జయరావు న్యూ తాపీ పనివార్ల సంఘం అధ్యక్షులు ఎండి అగ్బర్ ,దేవదాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం నిడుమోలులో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ముద్దులు బసవరావు,ఉప్పలపు వెంకటాద్రి, పార్టీ సభ్యులు కొనకళ్ళ నారాయణ, రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** ఉయ్యూరు టౌన్ స్థానిక శ్రామిక భవనంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు రత్నం భాస్కరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈఓ కొలుసు విశ్వ మోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరి శివ నాగేంద్రం, సిపిఎంఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి రాజేష్ సిపిఎం మండల కమిటీ సభ్యులు నిమ్మాది ప్రశాంతి, ఎం నాగమణి, సిపిఎం సీనియర్ నాయకులు అన్నే సుబ్బారావు, అట్లూరి రామచంద్రరావు తోమాటి లక్ష్మణరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరులో సిపిఎం సీనియర్ నాయకులు పిడుగు దేవసహాయం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు ళ అర్పించారు. మాండల భాద్యులు బి.వీశ్రీనివాసరావు, ఎమ్.జయలక్ష్మి, కవిపిఎస్ మాజీ నాయకులు వారా పాపారావు, పలగని వెంకటేశ్వరరావు, జంగం మోహనరావు పాల్గొన్నారు .సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయితీ యూనియన్ నాయకురాలు చిరుగుపల్లె సత్తెమ్మ పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. పంచాయితీ కార్మికులు జందుల వసుంధర, పి.సువర్ణ, చంద్రకళ, వి.నాగమణి పాల్గొన్నారు. వడ్లమాన్నాడు హరిజన వాడ అంబేత్కర్ సెంటర్లో వ్యవసాయ కార్మిక సంగంఊ మండల కార్యదర్శి కటికల యాకోబు, సిపిఎం భాద్యులు బీవీశ్రీనివాసరావు కటికల నాగరాజు,జంగం జార్జి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** ప్రజానాట్య మండలి కృష్ణాజిల్లా కార్యదర్శి కాసిం అధ్యక్షతన జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు పాల్గొని మాట్లాడారు. సీతారాం మృతి పేదలకు, కార్మిక వర్గానికి తీరని లోటని అన్నారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు మస్తాన్వలి, ప్రజానాట్య మండలి కష్ణాజిల్లా కార్యదర్శి కాసిం,పెనమలూరు మండల కార్యదర్శి యు త్రిమూర్తులు, రెండో శాఖ సెక్రెటరీ మాధవ, మూడో శాఖ సెక్రెటరీ ఎస్కే బాబు, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాతాళ లక్ష్మి , షేక్ వలిమా పాల్గొన్నారు. అలాగే కంకిపాడు మండలం బస్టాండ్ వెనక గల మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో మండల కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, మండల కార్యదర్శి టి నరేష్, మండల కమిటీ సభ్యులు శివశంకర్, దుర్గారావు, కుమారి,చంటి, శ్రీనివాసరావు, రవి, మరియదాస్, జాన్ మోజెష్ తదితరులు పాల్గొన్నారు **ప్రజాశక్తి కోడూరు :** కోడూరు ప్రధాన సెంటర్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడూరు మండలం సిపిఎం కార్యదర్శి పోలాబత్తిన మోహనరావు, ఆవుల బసవయ్య, కొప్పనాతి తాతయ్య, సిపిఎం సానుభూతిపరులు రేపల్లె యోగ ప్రకాష్, బాలగోపాల రామకష్ణారాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరవు, సిపిఐ గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, రమేష్, శంకరరావు, సూరిబాబు పాల్గొన్నారు. అలాగే సీతారాం ఏచూరి ఆకస్మిక మరణం పేదలకు తీరని లోటని కష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లు కష్ణ ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

అలాగే గన్నవరం సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్థిక విశ్లేషకులు గన్నే వెంకట్రావు, పార్టీ నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** పెద్దాఆవుటపల్లి సిపిఎం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గల స్థూపం వద్ద సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం ఉంగుటూరు మండల పార్టీ నాయకులు కామ్రేడ్ కడవకొల్లు రామరాజు, మహిళా సంఘం మండల కార్యదర్శి వెంకటరమణ, మండల నాయకులు కె జ్యోతి, పార్టీ నాయకులు ఎస్ కోటేశ్వరరావు, ఎస్ నాగమణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెడన :** స్థానిక బ్రహ్మపురంలో సిపిఐ నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు గోరు రాజు, సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి పంచల నరసింహారావు, సిపిఐ సీనియర్ నాయకులు వాసా గంగాధరం, గుంటూ నాగభూషణం పాల్గొన్నారు.

మహిళ మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి-మొవ్వ : మండలంలోని పెడసనగల్లు గ్రామ పరిధిలోని అయ్యంకి వెళ్ళు మార్గంలో ఊరి చివర గల రైస్ మిల్ సమీపంలో పంట బోదులో గుర్తు తెలియని సుమారు 40 సంవత్సరాల గల మహిళ మృతదేహం ఉండడంతో గ్రామ విఆర్ఒ మరీదు ఝాన్సీ ఫిర్యాదు మేరకు కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం అనుమానాస్పద మతికింద కేసు నమోదు చేశారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏదైనా సమాచారం ఉన్న యెడల 08671252333 కు గాని, 9440796473 గాని సమాచారం తెలియజేయాలన్నారు.

సిపిఎం అభిమాని మస్తాన్ మృతి



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని పఠాన్ మస్తాన్ అలియాస్ పెద్ద వలి (94) శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లం వెంకటేశ్వరరావు, గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, సిఐటియు నాయకులు బడుగు మరియ దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరసా వెంకటేశ్వరావు, గ్రామ పార్టీ నాయకులు బాజీ, తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించి స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు బాషా మృతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలోని మైనార్టీ పెద్దలు, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు, గుడివాడ షాదీ ఖానా కమిటీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్ బాషా(65) మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక పెద్దవీధిలోని ఆయన స్వగృహంలో గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన కుమారుడు మహమ్మద్ ఖాసిం (అబూ) రాజకీయ నాయకుడు కావడంతో, ఇక్బాల్ బాషా భౌతిక కాయానికి గుడివాడలోని మైనార్టీ సంఘాల పెద్దలు, పలు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

16 వరకు పంట నష్టం జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మండలంలో 33 శాతం పైచిలుకు పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి లోయ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా అంగలూరు రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టం జరిగిన పంటలు, రైతుల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల నోటీసు బోర్డులలో ఈనెల 16వ తేదీ వరకు ప్రదర్శిస్తామన్నారు. ప్రదర్శించిన జాబితాలపై ఏమైనా సహేతుకమైన అభ్యంతరాలు ఉన్న యెడల 16వ తేదీలోపు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకునికి అందజేసిన యెడల పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి 17వ తేదీ తుది నివేదికను జిల్లా స్థాయి అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యేలిషారావు, గ్రామ సహాయకులు మరియూ గ్రామ రైతులు పాల్గొన్నారు.

బుడమేరు పరీవాహక ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - గుడివాడ : పుట్టగుంట బుడమేరు పరివాహక ప్రాంతాలను గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారిణి జి.సంపత్‌కూమరి పరిశీలించారు. శుక్రవారం నందివాడ మండలంలోని పుట్టగుంట బుడమేరు ఉదతివల్ల నష్టపోయిన గ్రామాలు సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందివాడ మండలంలో సుమారు 13 గ్రామాలు బుడమేరు వల్ల మునిగాయన్నారు. 166 గృహాలు పాక్షింగా మునిగిపోయినట్లు తెలిపారు. 37 షెడ్లు కూడా నీటిలో మునిగిపోయినట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రమ్మ జీవితం ఎందరికో ఆదర్శం

ప్రజాశక్తి-గన్నవరం : చదువును ప్రేమించిన, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసిన రామచంద్రమ్మ జీవితం ఎందరికో ఆదర్శమని వికెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం మండలం కేసరపల్లి విమానాశ్రయం ఎదురుగా ఉన్న వేములపల్లి కోదండ రామయ్య కళాశాలలో యాజమాన్య కమిటీ మాజీ అధ్యక్షులు దివంగత మొటపర్తి రామచంద్రమ్మ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో వికెఆర్ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేలా చేసిన ఘనత రామచంద్రమ్మదే అన్నారు. కాలేజీ అభివద్ధి లో ఎనలేని కషి చేశారని తెలిపారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు జ్యోతి మాట్లాడుతూ.. అధ్యాపకులను చక్కటి మార్గంలో నడిపించారని, నూతన కాలేజీ ఏర్పాటుకు ఆమె చేసిన కషి మరువలేనిదని చెప్పారు. కళాశాల సిబ్బంది పాలా శ్రీనివాసరావు, నవీన్, ఉషశ్రీ, తేజ కుమారి, సుంకర స్వర్ణ మంజు, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

కెయులో ఇంజనీర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. క్యాంపస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ విజయ్ కుమారి సమన్వయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఆచార్య పి ఉదయ్ భాస్కర్ విచ్చేసి ప్రారంభకోపన్యాసం చేస్తూ విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన విశేష సేవలను విద్యార్థులకు వివరించారు. భారతదేశపు ప్రతిష్టాత్మక ఇంజనీరుగా, రాజనీతిజ్ఞునిగా తదనంతర కాలంలో మైసూరు మహారాజా సంస్థానాధీశపు దివానుగా ఆయన అందించిన సేవలను కీర్తించారు.అతి సామాన్య స్థాయి నుంచి అసామాన్య స్థాయికి ఎదిగి మన దేశ అత్యున్నత పరస్కారం భారతరత్న పొందడంలో విశ్వేశ్వరయ్య చేసిన కషి పట్టుదలే కారణమనీ, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుంటే భావితరం కూడా అద్భుతాలు సష్టించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు, క్టార్ ఆచార్య ఎం బసవేశ్వర రావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్యణి ఎన్ ఉష, ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ, అప్పికట్ల గ్రామాల్లో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్వైజరులు ఎం శివ నాగమణి, జి అరుణ్ కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. హెచ్ఎం శ్యామ లమ్మ మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పమిడిముక్కల : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని అయినం పూడి గ్రామంలో రైతులతో కలిసి పంట నష్టాన్ని అంచనా వేశారు. 447 ఎకరాల్లో నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి గణేష్ రెడ్డి తెలిపారు.పంట నష్టపోయిన వారందరికీ పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తెలుగుదేశం కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శనివారం
14 సెప్టెంబర్ 2024

మురుగులోనే ఆవాసం





జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో ఇళ్ళ మధ్యలో వరద నీరు









ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉన్న దృశ్యాలు





జగ్గయ్యపేటలో ఇళ్ల మధ్యనే మురుగు



జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ పక్కనే పారుతున్న బుడమేరు కాలువ ముంచెత్తుతుండటంతో పూడిక తీస్తున్న దృశ్యం





జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో ఖాళీ ప్రదేశంలో తగ్గని బుడమేరు వరద నీరు



సింగ్‌నగరలో ఓ కాలనీలో పరిస్థితి



వరద ప్రాంతాల్లో బ్లీచింగ్ కొడుతున్న కార్మికులు



సింగ్‌నగర్‌లో మురుగు నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్న దృశ్యం



ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న బోటు బయటకు తీసే ప్రయత్నాలు



ప్రకాశం బ్యారేజీ వద్ద బోటును బయటకు తీసే ప్రయత్నాలు

వరద నీటి నిల్వతో ఇబ్బందులు

- నీరు పోయే మార్గంలేక అగచాట్లు
- వ్యాధులు వ్యాప్తిస్తాయని ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - గన్నవరం : వర్షాలకు, చెరువులూ, వాగులు పొంగడంతో నీట మునిగిన గ్రామాలు బయట పడుతున్నాయి. అయితే ఇళ్లలో మురుగు, పొలాల్లో ఎటు చూసినా బురద కనిపిస్తుంది. చీమల వాగు పొంగి బీబీగూడెం, కేసరపల్లి, పురుషోత్తపట్నం, చిక్కవరం, గొల్లనపల్లిలో ఇళ్లకు నీరు పట్టింది. రోడ్లు మురుగుతో నిండాయి. ఎటు చూసిన మురుగు ముంచెత్తింది. స్కూళ్ల లో నీరు చేరడంతో పిల్లలు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. మురికి నీటిలో నడిస్తే చర్మ వ్యాధులు వస్తాయని తల్లిదండ్రులు భయపడుతున్నారు. వి.యన్ పురంలో పరిస్థితి దయనీయంగా మారింది. 2 వేల జనాభా, ఆరు ప్రధానమైన రోడ్లు ఉండగా అంతర్గత రోడ్లు 80 ఉన్నాయి. వాటిని పూర్తి గా అభివద్ధి చేయకపోవడంతో నీరు నిలిచి నడవటానికి వీల్లేని దుస్థితి నెలకొంది. రోడ్ల పక్కనే ఉన్న కాల్వలోనూ, ఖాళీ స్థలాల్లోనూ నీరు నిలి చింది. దోమలకు నిలయంగా మారుతోందని చెబుతున్నారు. నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో నివాశతులు నానా అగచాట్లు పడుతున్నారు. బురదమయంగామారిన రోడ్లపై నడవలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో దట్టంగా మొలిచిన పిచ్చి మొక్కలతో పాటు నీరు చేరడం తో పాముల సంచారం ఎక్కువైందని తెలిపారు. రాత్రిళ్ల రోడ్లపైకి రావాలంటే ఆలోచిస్తున్నారు. పాములు కరిస్తే దావడం తప్ప వేరొకటి లేదంటున్నారు. పంపుల్లో నీరు కలుషితమవడంతో డయేరియా వ్యాధులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ముంపు గ్రామంలో దళితుల ఇళ్ల చుట్టూ మురుగు పెద్ద ఎత్తున నిలిచింది. దీనికి తోడు జనాలు చెత్తపోగులు వేయడంతో కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. కాలనీ లో ఎక్కడ చూసినా మురుగే కనిపిస్తుందని చెబుతున్నారు. అంటురోగాలు వ్యాపించే అవకాశం ఉందని భయపడుతున్నారు. బీబీ గూడెం ఎం.పి.పి స్కూలు చుట్టూ నీరు నిలిచింది. ఈ పరిస్థితుల్లో నీటి క్లోరినేషన్తో పాటు మురుగు నీరు బయటకు పోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలి. ఆపనులు చేయాలంటే డబ్బులు కావాలి. పంచాయతీ లో నిధులు లేకపోవడంతో మావల్ల కాదని అధికారులు చేతులెత్తే శారని జనాలు తెలిపారు. సిమెంట్ రోడ్డు వేసినా డ్రైన్లు కట్టక పోవడంతో కాలనీలో ఎటు చూసినా మురుగు సమస్య



కనిపించింది. ముంపు ప్రాంతాల్లో ఉంటున్న వారంతా పేదలే. ప్రజాప్రతినిధులు పెద్దగా పట్టించుకోవడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నివాశితులు విమర్శిస్తున్నారు. మండల స్థాయి అధికారులైన స్పందించి మురుగు సమస్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆయుధాగారంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయుధాగారంను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయుధాగారంలో ఉన్న ఆయుధాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఆదేవిధంగా ఆర్మోరర్ వర్క్ షాప్, యాంటీ రాయిట్ సామాగ్రి, మందుగుండు సామాగ్రి (అమ్యునేషన్) నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయుధాలను ప్రతి వారం సఫాయి నిర్వహించాలని, ఎస్ఐ ఆపై స్థాయి అధికారులకు వార్షిక ఫైరింగ్ నిర్వహించాలని, ఆయుధాగారం పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు, ప్రతి పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బంది అందరికీ సరిపోయేలా స్టోన్ గార్డ్స్, హెల్మెట్లు, లాఠీలు సమకూర్చాలని తెలిపారు. ఆదేవిధంగా ఎటువంటి తారతమ్యాలు లేకుండా ప్రతి సిబ్బందికి టర్న్ ప్రకారం డ్యూటీలకు నియమించాలన్నారు, ఎస్కార్ట్ డ్యూటీ, గార్డు డ్యూటీలు, ఇతర ఆర్మ్ డ్యూటీలు %ద% వార్షిక ఫైరింగ్ నిర్వహించే సమయంలో ఆయుధాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తుపాకులకు, తూటాలలో ఏదైనా పొరపాటు జరిగితే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీలో ఏ ఆర్ డిఎస్పి వేంకటేశ్వర రావు, అడ్మిన్ ఆర్ఐ నరేష్,ఎం టి ఆర్ఐ రవి కిరణ్, ఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాలు పరిశీలిస్తున్న ఎస్పి గంగాధరరావు

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

- ఇద్దరు నిర్వాహకులు, ముగ్గురు యువతుల అరెస్టు

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడలో మొగల్రాజపురం పరిధిలోని ఓ భవనంలో బాడీ మసాజ్ సెంటర్ పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. మసాజ్ సెంటర్ ముసుగులో రహస్య వ్యభిచారం జరుగుతుందనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సెంటర్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు యువతులను పట్టుకున్నారు. అనంతరం వారిని మాచవరం పోలీస్ స్టేషన్లో అప్పగించారు. శుక్రవారం మాచవరం సిఐ ప్రకాష్ తెలిపిన వివరాల మేరకు మొగల్రాజపురంలో బాడీస్పా సెంటర్ ను ఇరువురు వ్యక్తులను కొంతకాలం నుంచి నిర్వహిస్తున్నారు. యువతులను పెట్టి రహస్యంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దరిమిలా సెంటర్ పై దాడి చేసి నిర్వాహకులను అరెస్ట్ చేశామన్నారు. అలాగే ఇద్దరు యువతులను రక్షించామని తెలిపారు. బాడీ మసాజ్ సెంటర్లో పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తమ సర్కిల్ పరిధిలో మసాజ్ సెంటర్ లప్పై దేగ కన్ను వేశామన్నారు.

ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : సిపిఎం,టిడ్కో కాలనీ కమిటీల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి 41 సెంటర్లో టిడ్కో కాలనీలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, సిపిఎం టిడ్కో కాలనీ సానుభూతిపరుల శాఖ కార్యదర్శి జనప అరుణ మాట్లాడుతూ పేదవారికి పార్లమెంటులో వాణి వినిపించారన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేమన్నారు. తెలుగు ఏచూరి చిత్రపటానికి సిపిఎం సానుభూతిపరులు సయ్యద్ నూరున్నిసా, ఆర్.శివరాంప్రసాద్ లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సానుభూతిపరులు ఆర్.గణేష్, ఎస్.రంగమ్మ, పిల్లి రాధ, ఇందిరా, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు మేరమ్మ, టి.ఉషారాణి, ఎమ్.సామ్రాజ్యం, గంటా నాగమణి, గంజి ఆదిలక్ష్మి, కె.నగసరోజిని, టి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలాగే తాడిగడపలోని సిఐటియు కార్యాలయం వద్ద, పెనమలూరు మండల కార్యాలయం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు, డివైఎఫ్ఐ నాయకులు, ఐద్వా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు : ఎస్పి

ప్రజాశక్తి కలక్టరేట్,(కృష్ణా) : సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసులకు శుక్రవారం నుండి మీ కోసం హాల్లో జిల్లా ఎస్పి ఆర్ గంగాధర రావు మహిళా పోలీసులకు పారదర్శకంగా కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ బదిలీలను ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల మేరకే చేస్తామని, బదిలీలు కోరుకునే ఉద్యోగిని తన స్వగ్రామం/వార్డు ఉండే సచివాలయం మినహా ఇతర సచివాలయాలను కోరుకోవాలని, ఖాళీల వారీగా ఉన్న సచివాలయాల అప్షన్లను కంప్యూటర్ డిస్ప్లే నందు ఉంచామన్నారు. శుక్రవారం నిర్వహించిన బదిలీల్లో వారి ర్యాంకుల ఆధారంగా మ్యూచువల్ ట్రాన్స్ఫర్, స్పౌస్ కోటా, దివ్యాంగుల కోటా మరియు ఆరోగ్య పరమైన సమస్యలు ప్రాతిపదికన బదిలీలు చేపట్టగా మొత్తం 135 మంది మహిళా పోలీసులు ఆఫ్ లైన్/ఆన్‌లైన్ బదిలీ కొరకు దరఖాస్తు చేసుకొని కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొనగా ఖాళీగా ఉన్న స్థానాలలో వారికి నచ్చిన స్థానంలోకి బదిలీ కోరగా మరికొంత మంది యథావిధి స్థానాల్లో కొనసాగడానికి అంగీకారం తెలిపారన్నారు. సదరు బదిలీల నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపి వారి ద్వారా వారికి పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాలలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ ధ్యానచంద్ర గురువారం రాత్రి వైయస్సార్ జక్కంపూడి కాలనీలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వరద ప్రభావిత ప్రాంతాలలో ఒకటైన వైఎస్ఆర్ జక్కంపూడి కాలనీలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వైయస్సార్ జక్కంపూడి కాలనీలో నీటి సరఫరా జరుగుతున్న మోటార్ వరద వల్ల పూర్తిగా పాడైపోవడం గమనించి వెంటనే అక్కడ కొత్త మోటార్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సురక్షితమైన త్రాగునీరు సరఫరా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకొని ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేసేటట్టు చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ ఎస్ ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. 62,63, 64 డివిజన్లలోని పల్లపు ప్రాంతం ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ...బుడమేరు ప్రభావిత ప్రాంత ప్రజలకు నగరపాలక సంస్థ వారు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ అది కేవలం వాడుటకు మాత్రమే వినియోగించాలన్నారు. బుడమేరు వరదలు నుండి సత్వరమే విజయవాడలోని పలుప్రాంతాలు కోలుకున్నాయని, ఈ ప్రాంతాలకు విఎంసి నీటిని సరఫరా చేస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు.



ఎల్‌బిఆర్ సిఇ అధ్యాపకునికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఫ్రెష్ మెన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకుడు రామిరెడ్డి పిహెచ్‌డి పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్నంగి రామిరెడ్డి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో స్టడీ ఆఫ్ స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ చాట్ అండ్ రిలేబులిటీ టెస్ట్ ప్లాన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పిహెచ్‌డిని ప్రదానం చేశారన్నారు. ఈ పరిశోధన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిందన్నారు.

పిల్లలకు ఫ్లూ వచ్చే ప్రమాదం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వర్షాకాలం కావడం, వరుసగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు గాను చిన్నపిల్లలు ఫ్లూ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కార్తీక్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలోని బ్రైట్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ బి.కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సిఎంఇలో ఆయన మాట్లాడుతూ ఈ వాతావరణం వల్ల ఇన్ఫ్లుఎంజా వృద్ధి చెందే అవకాశాలున్నాయన్నారు. ఈ సీజన్‌లో ఫ్లూ ఇన్‌ఫెక్షన్ల పెరుగుదల అధికంగా కనిపిస్తుందని, తేమ, ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు ఫ్లూ వైరస్‌ల వ్యాప్తిని ప్రోత్సహిస్తాయన్నారు. దీని నుంచి కాపాడుకోవడానికి పిల్లల్లో ఫ్లూ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. ఇండియన్ అకాడెమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపి) 6 నెలల నుండి 5 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు ప్రతి సంవత్సరం ప్రైమరీ ఇన్ఫ్లుఎంజా ఇమ్యునైజేషన్ పూర్తి చేసిన తర్వాత సమస్యలను నివారించడానికి ఫ్లూ వ్యాక్సినేషన్‌ను పొందాలని సిఫార్సు చేస్తోందన్నారు. తమ పిల్లలకు ఫ్లూ వ్యాక్సినేషన్ గురించి వారి శిశువైద్యులను సంప్రదించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఇంకా వరద నీటిలోనే...

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

వరదలు వచ్చి 15 రోజులు అవుతున్నప్పటికీ ఇంకా మండలంలోని జయంతిపురం గ్రామాన్ని వరద నీరు వదలటం లేదు. గ్రామముకి చెందిన ఎస్సీ కాలనీలో సుమారు 60 ఇండ్లు వరద నీటిలోనే ఉన్నాయి. ప్రజలు బయటికి రావాలంటే వరద నీటిలోనే రావాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామంలో మూడు ఇల్లు ఈ వరదలకు దెబ్బతిన్నాయని, రావిరాల గ్రామంలో 2 ఇండ్లు వరదలకు దెబ్బతిన్నాయని, మరో 20 ఇండ్లు వరద తాకిడికి గురయ్యాయని, జయంతిపురం ఎస్సీ కాలనీకి పూర్తిస్థాయిలో వరద నీరు బయటకు పంపి బాధితులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఎంత ఇబ్బందులు పడుతున్న వరద బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సినటువంటి సహాయం అందట్లేదని బాధితులు వాపోతున్నారు.

ఏచూరికి పలువురు ఘన నివాళి

విజయవాడ : సిపిఎం తూర్పు కమిటీ ఆధ్వర్యంలో ఏచూరికి నివాళులర్పించారు. 22వ డివిజన్ 21వ డివిజన్ 17వ డివిజన్ 15 డివిజన్ 9వ డివిజన్ 14వ డివిజన్ 7వ డివిజన్‌లలో పార్టీ శాఖలు నివాళు లర్పించాయి. కృష్ణలంక 21 డివిజన్లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి 50 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడు 1974లో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఉద్యమంలో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నేడు సిపిఎం ప్రధాన కార్యదర్శిగా అత్యున్నత దశలో ఉన్నప్పుడు ముగిసిందన్నారు. జెఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా ఇందిరాగాంధీని పదవి నుండి దించేందుకు చేసిన పోరాటం ఆనాడు దేశవ్యాప్తంగా చర్చాంశం అయిందన్నారు. ప్రతి ఒక్కరితో స్నేహభావంతో మెలిగే స్వభావం వలన అన్ని పార్టీల్లోనూ మంచి సంబంధాలు కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, బత్తుల చిన్నారావు నగర నాయకులు కోరాడ రమణ, చంద్రశేఖర్, శాంతి, నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు : సిపిఎం నాయకులు దారా నాగేశ్వరరావు ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణ, సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు : వీరులుపాడు గ్రామంలో సిపిఎం కార్యాలయంలో ఏచూరి సంతాప సభ జరిగిది. ఈ సంతాప సభలో సీనియర్ కామ్రేడ్ వట్టి కొండ పార్థసారధి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, వట్టికొండ రమేష్, వాసిరెడ్డి రాంబాబు, జుజ్జూరులో లాల్ అహ్మద్ గౌస్ మంగళపూడి సుందర్‌రావు షేక్ యాకోబు సంతాపం తెలిపారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని జగ్గయ్యపేట మండల సిపిఎం ఆధ్వర్యంలో ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శిసోమోజు నాగమణి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు కోట కృష్ణ, కోట రవికుమార్, దంతాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ పాల్గొన్నారు.

మైలవరం : స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి రావూరి రమేష్ బాబు, మండల కమిటీ సభ్యులు రావుల సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని, నేటి తరం వారందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.సుధాకర్ మండల కమిటీ సభ్యులు సందీపం ఇసాక్, సందీపాము పౌలు, జట్టి వెంకటేశ్వరరావు, ముఠావర్కర్ సీనియర్ నాయకులు మారేశ్వర రావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. మండలం కేంద్రంలో గల సిపిఎం మండల కార్యాలయంలో మండల కార్యదర్శి కామ్రేడ్ జంగా వెంకటరెడ్డి సీతారాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సిపిఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, నాయకులు ఉయ్యూరు కృష్ణారెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు కొండపల్లి పరమేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఉయ్యూరు రాధాకృష్ణరెడ్డి, రైతు సంఘం నాయకులు అప్పిరెడ్డి, విజయ్, బాబు, పెద్ద వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఏచూరి చిత్రపటానికి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో సిఐటియు దిమ్మె వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్, మండల కమిటీ సభ్యులు ఎ.విఠల్ రావు పూలమాలతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో హాకర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, నవీన్, రామారావు, ప్రభుదాస్, లైలా, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ అర్బన్ : ఏచూరి సంతాప సభ పటమట ఈ సేవా కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం శాఖా కార్యదర్శి,నగర కమిటీ సభ్యులు రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్.కె. మస్తాన్, నగర నాయకులు వి.గురుమూర్తి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ శాఖా కార్యదర్శి బెనర్జీ, యల్లారావు, ఏడు కొండలు పాల్గొన్నారు. పలు కళా సంస్థల ప్రతినిధులు తెలిపారు. తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, ఎక్సరే సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ లు శుక్రవారం సాయంత్రం గాంధీనగరంలోని కౌతా కళా సంస్థల గదిలో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, డేవిడ్ రాజు, బోడి ఆంజనేయరాజు, బివి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం పంపిణీ, ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఫెర్రీ వరద బాధితులకు అండగా సిపిఎం తలపెట్టిన భోజన పంపిణీ కార్యక్రమం 7వ రోజుకు చేరింది. ప్రతి రోజు 500 మంది పైగా భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్మారక భోజన కేంద్రం ఫెర్రీ రామాలయం వద్ద జరుగుతున్న వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఏర్పాటు చేసిన భోజన కేంద్రం వద్ద భోజనాలు అనేక మంది దాతల సహకారంతో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ సభ్యులు కామ్రేడ్ రామ సీతా, కష్ణ రాయలు, ఎల్ పార్వతి, కె.బేబీ సరోజిని, ఏ కామేశ్వరరావు, సిఐటియు నాయకులు కే వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని శాంతినగర్ మరియు విష్ణు ప్రియ నగర్ లలో శుక్రవారం చింతామణి ఆంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట వరద బాధితులకు సహాయార్థం నిత్యవసర సరుకులును ఏర్పాటు చేసినారు. వాటిని తీసుకొని వెళ్తున్న వాహనం (ట్రాక్టర్) కు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని నాగమయ్య బజారులో వరద ముంపుకు గురైన బాధితులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సూచనలతో రాంకో సిమెంట్స్ వారు వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా అందజేశారు

నందిగామ : వరద బాధితుల కోసం కమ్మ సంఘం రూ.2లక్షల ప్రకటించి విరాళాన్ని కాకానీ నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎంఎల్ఎ సౌమ్యకు అందజేశారు. కమిటీ సభ్యులు కామసాని సత్యవతి, వాసిరెడ్డి సత్యన్నారాయణ ప్రసాద్, వాసిరెడ్డి శ్రీరామకష్ణ, ఉప్పుటూరి వాసుదేవరావు, పాలేటి సతీష్ ఉన్నారు.

కంచికచర్ల, నందిగామ : కంచికచర్ల మండలం గొట్టిముక్కలలో ఇటీవల వరదల సమయంలో వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన గాలి సత్యనారాయణ (64) కుటుంబ సభ్యులకు నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో గండి వాగుకు భారీగా వరద వచ్చిన విషయం తెలిసిందే.

మైలవరం : ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వరద నీటిలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి మరణించిన మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం స్థానిక శాసనసభ్యులు వసంత కష్ణ ప్రసాద్ అందజేశారు. వెల్వడం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, అనంతవరం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావు 31న వచ్చిన వరదల్లో చిక్కుకొని కొట్టుకుపోయి మృతి చెందడంతో ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మైలవరం : వెల్వడం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పల్లపోతుల గోపాలు దంపతులు వరద బాధితుల సహాయార్థం రూ.20 వేల విరాళాన్ని శుక్రవారం స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వసంత మాట్లాడుతూ వరదల వల్ల తీవ్రంగా నష్టపోయామని ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతవరకు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు.

భవానీపురం : బుడమేరు ముంపునకు గురైన కబేళా సెంటర్లో నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమాన్ని కృష్ణ చైతన్య డిగ్రీ కాలేజ్ నెల్లూరు వారి కాలేజీ డైరెక్టర్ ఆర్ వి.కృష్ణారెడ్డి, డీన్ సుధారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రాజేష్ రెడ్డి, శ్రీహరి, చక్రధర్ వరద బాధితులకు పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నం : వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధ్యులకు తమ వంతు సహాయం చేసేందుకు కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు ముందుకు వచ్చారు. కొండపల్లి, మూలపాడులో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోరాట సమితి ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలకు దుప్పట్లు అందించారు. ప్రముఖ ఊపిరితిత్తులు నిపుణులు డాక్టర్ బాలకష్ణ ,కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట సమితి సభ్యులు భవాని, మాధురి,నగీనా, హైదర్, పాల్గొన్నారు.

గంపలగూడెం : స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏచూరి చిత్రపటానికి మండలం పార్టీ కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి నివాళులర్పించారు. మండల కమిటీ సభ్యులు మీసాల గోపాలకృష్ణ, జానపాటి వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి వెంకటరెడ్డి, డిజె సుందర్రావు, శాంతామణి, బండి వీరబాబు, మల్లవరపు కుటుంబరావు, గుంటూరు వీరభద్రం, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

వన్‌టౌన్ : విజయవాడ వరద ఉధృతికి చాలా మంది సర్వం కోల్పోయారని, టిడిపి కార్యకర్తలు నివసించే ప్రాంతాల్లో వరద ప్రభావానికి ఇళ్ళల్లో టివిలు, ఫ్రిజ్‌లు కోల్పోయారని, వారిని ఆదుకునే బాధ్యతతో శుక్రవారం నూతన గృహోపకరణాలు కొనుగోలు చేసి అందించినట్లు బుద్ధా వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పునుగుపాటి చిన్న సుబ్బయ్య, నాగోతి రామారావు, రాజేష్, తదితరులు ఫ్రిజ్‌లు అందుకున్నవారిలో ఉన్నారు.

జానపదాలు మన వారసత్వ సంపద

ప్రజాశక్తి - మైలవరం : జానపదాలు మన వారసత్వ సంపదని లక్కిరెడ్డి బాల్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డాక్టర్ లకిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో తరతరాల తెలుగువారి జానపద కళారూపాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం జానపద కళలకు పుట్టినిల్లని అన్నారు. జానపద వాజమయం, జానపద కళల గురించి పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి - తిరువూరు : తల్లి దండ్రులను, గురువులను గౌరవిస్తేనే, మంచి పౌరుడిగా ఎదగడానికి అవకాశం ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.బాలు తెలిపారు. శుక్రవారం గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు – సామజిక బాధ్యత అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశా ల హెచ్.ఎం.జి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, రాంప్రదీప్, రామారావు, సుదర్శన్, వెంకటేశ్వర్లు, రాము, సామజిక కార్యకర్తలు ఎన్.తలీజమ్మ, టి. శిరీష తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన పేట మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఆయన తండ్రి రంగాపురం నర్సింహారావు మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారితో పాటు 7వ వార్డు కౌన్సిలర్ పూసపాటి సీతారావమ్మ దంపతులు, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కుమారుడు కష్ణ, 23వ వార్డు కౌన్సిలర్ డి.రమాదేవి దంపతులు టీడీపీలో చేరారు.

ప్రతి బిడ్డకూ పౌష్టికాహారం అందాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : పుట్టిన ప్రతి బిడ్డకు పౌష్టికాహారాన్ని తల్లులు అందించి, ఆరోగ్యాన్ని సమర్థవంతంగా, కాపాడాలని గంపలగూడెం ఐసిడిఎస్ సూపర్వైజర్ ముని లక్ష్మి తెలిపారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా స్థానిక 67వ సెంటర్‌ను సందర్శించి, పలు సూచనలు ఇచ్చారు. మొదటగా, బిడ్డల బరువు, ఎత్తు, తదితర అంశాలను కొలతలు వేసి, బిడ్డలకు ఎలా అందించాలో వివరించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని వరద ప్రభావిత ప్రాంతమైన కే. కొత్తపాలెం దళితవాడలోని బాధిత కుటుంబాలకు ఢిల్లీకి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్, శ్రావణ్ కుమార్ ఆర్థిక సహకారంతో శుక్రవారం 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. మొవ్వ మండలం కాజా గ్రామానికి చెందిన తాతా–మణి ప్రసాద్ (బాబు) , వేముల అన్విత , వేముల,వేముల అద్విత్ ల ఆధ్వర్యంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ముక్కు వెంకటేశ్వరరావు, కుమారస్వామి బాధిత కుటుంబాలకు దుప్పట్లు , బిస్కెట్లు అందించారు.

వరిగడ్డి పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల : ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదలు కారణంగా లంక గ్రామాల్లో పశువులకు మేత లేక ఆయా గ్రామాల రైతులు, పశువుల కాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఘంటసాల గ్రామానికి చెందిన నిమ్మగడ్డ శేషగిరిరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో వరిగడ్డి కొని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాలకు చెందిన పాత ఎడ్లంక, కె.కొత్తపాలెం, ఆముదాల లంక, రాయలంక గ్రామాలకు చెందిన పశువులకు అవసరమైన వరిగడ్డిని శుక్రవారం ట్రాక్టర్ సహాయంతో రైతులకు పంపించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

ప్రజాశక్తి - తిరువూరు : అక్రమ నిర్మాణం అని ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరు వూరులోని కన్యాకాపరమేశ్వరి దేవదాయా, ధర్మాదాయ షాపింగ్ కాంప్లెక్స్‌కు శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఎండోమెంట్ గన్నవరం ఇన్ స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో శుక్రవారం వేలం పాట నిర్వ హించగా విజయవాడకు చెందిన అద్దె సురేష్, గ్రౌండ్ ఫ్లోర్, పైఫ్లోర్ కైవసం చేసుకున్నారు. రూ.ఐదు లక్షల డిపాజిట్‌తో కింద ఫ్లోర్‌కు ఆరుగురు, రూ.రెండు లక్షల డిపాజిట్‌తో పై షాపింగ్ కాంప్లెక్స్ ఆరుగురు టెండర్ దాఖలు చేశారు. కింద ఫ్లోర్ ను అద్దె సురేష్ రూ.2.20 లక్షలకు, పై ఫ్లోర్ రూ.30 వేలకు దక్కించుకున్నారు. ఎండోమెంట్ నిబంధనల ప్రకారం షాపింగ్ కాంప్లెక్స్ తీసుకున్నవారు మత్తు పదార్థాలు, ముందుగుండు సామాగ్రి, మారణ ఆయుధాలు, ఎరువులు, పురుగు మందులు వంటి వ్యాపారాలు చేయకూడదన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా)

విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల ఖర్చులను తగ్గించుకునేందుకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ప్రజలను కోరారు. శుక్రవారం ఆయన సబ్సిడీతో కూడిన సౌర విద్యుత్ పథకం వినియోగంపై విద్యుత్ శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా విస్తత అవగాహన పరచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ఒక వినూత్నమైన పథకమని, ఇది దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమన్నారు.ఈ పథకం కింద ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ అమర్చుకోవచ్చని, తద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ఇంటి అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. గహ అవసరాలకు వినియోగించుకోగా మిగులు సోలార్ విద్యుత్తుకు ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసిపిడిసిఎల్) ప్రతి యూనిట్కు రూ.2.09 పైసలు తిరిగి ఆ వినియోగదారుడికి చెల్లిస్తుందని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి : కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ డి.కె.బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పటిష్టమైన రోడ్డు భద్రత చర్యలు చేపట్టి, రోడ్డు ప్రమాదాల నివారణకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్లో మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులలో రోడ్డు ప్రమాదాలకు అవకాశం గల బ్లాక్ స్పాట్స్ గుర్తించి, సంబంధిత శాఖల సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులలో సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో కష్ణ, బుడ మేరు వరదలకు ముంపున గురైన ప్రాంతాల్లో పాడైన ద్విచక్ర వాహనాలు బాగు చేయించడం, డీలర్లతో మాట్లాడి స్పేర్ పార్ట్స్ అందించేలా చూడాలని, బాధితులకు సహకారం అందించాలని కలెక్టర్ రవాణా శాఖ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం పై క్యాంపెయిన్ నిర్వహించి, హెల్మెట్ లేని వాహనదారులతో అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేసేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి ఎస్ వి డి ప్రసాద్ , ఎన్ హెచ్ ఏ ఐ పిడి శ్రీధర్ రెడ్డి, మోర్త్ అధికారి సుధీర్ ,జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మొవ్వ మొవ్వ మండలం కాజ గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఆరు కుటుంబాల పంచాయితీ పారిశుధ్య కార్మికులకు ఉష డిజైనర్స్ ఉయ్యూరు అధినేతలు ఆలపాటి ఉషారాణి, ఆలపాటి ఝాన్సీ రాణి సహకారంతో గురువారం బాధిత కుటుంబాలకు రెండు చీరలు ,ఒక కండువా, ఒక దుప్పటి, ఒక లుంగీ ,నిత్యవసర సరుకులు, వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగి నవ్య, తాడంకి నరేష్, పిల్లి అవినాష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, కాజ శాఖా కార్యదర్శి కొడాలి కరుణాకర్ రావు, శాఖ సభ్యులు ముర హరి, సిఐటియు జిల్లా నాయకులు ఎం పోలి నాయుడు, మొవ్వ మండల సీఐటీయూ కార్యదర్శి కాకి రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మొవ్వ మండల అధ్యక్ష కార్యదర్శులు అలెగ్జాండర్, కొడాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదానికి గురై సమస్తంకోల్పోయిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటాలని జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జి బండి రామకృష్ణా అన్నారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని చిన్నాపురం డాక్టర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 40 వేల మొక్కలు కార్యక్రమం వర్షాల కారణంగా వాయిదాపడగా ఈ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పద్మావతి కళాశాల లో నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లకు వాహనాల ద్వారా తరలించి డివిజన్ ఇన్చార్జులు కూటమి నాయకుల సహకారంతో ఇంటికో మొక్క పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు,డివిజన్ ,పంచాయతీ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

వరద బాధితులకు తానా సహాయం

ప్రజాశక్తి మోపిదేవి :తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తానా ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. శు క్రవారం మోపిదేవి మండలం బొబ్బర్లంకలో 200 వరద బాధిత కుటుంబాల వారికి తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది రకాల నిత్యావసర సరుకులు, టవల్స్ సహాయంగా పంపిణీ చేశారు. గ్రామంలోని ఒక్కొక్క కుటుంబానికి 5కేజీ ల బియ్యం, 1కేజీ కందిపప్పు, 1 కేజీ గోధుమపిండి, 1కేజీ ఆయిల్ ప్యాకెట్, 1కేజీ సాల్ట్, 1/2కేజీ పుట్నాలపప్పు, 1/2 కేజీ వేరుశెనగ గుళ్ళు, 100 గ్రాముల సాంబార్ పౌడర్, 100 గ్రాముల పసుపు, 100గ్రాముల కారం, మరియు ఒక కండువా చొప్పున నిత్యావసర సరుకులను సంస్థ వారు అందజేశారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని టిడిపి గ్రామ అధ్యక్షులు దొప్పలపూడి జగదీష్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి బీవీ రావు, వేమూరి వెంకటరావు పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండల పరిధి గుండేరు డ్రైన్ చిలల వాగు మైనర్ డ్రైన్ అచ్చంపాలెం నుండి దాలిపర్రు వరకు డ్రైన్ కి ఇరుపక్కల ఉన్న చిన్న, సన్నకారు రైతాంగాని ఆదుకోవాలని కష్ణాజిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు అందే జగదీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా అందే జగదీష్ మాట్లాడుతూ నష్టపోయినా రైతులు అందరూ ఎస్సీ, ఎస్టీ బీసీ కులాలవారు నిరుపేద చిన్న సన్నకారు రైతులు కుంట సెంటు పోరంబోకు భూమిని సాగు చేసుకుని గత 40 సంవత్సరాలుగా పంట పండించుకుంటున్నారన్నారు. సుమారు 500 ఎకరాల్లో సాగు చేసుకునె చిన్న సన్నకారు రైతులకు ఎకరాకు 15000 రూపాయల వరకు ఖర్చుపెట్టి పూర్తిగా నష్టపోయారని అన్నారన్నారు.

టొయోటా కిర్లోస్కర్ 'టి కేర్'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తమ కస్టమర్‌లకు సంపూర్ణ యాజమాన్య అనుభవాన్ని అందించడానికి ఉద్దేశించిన వినూత్న కార్యక్రమం టి కేర్ టొయోటా కిర్లోస్కర్ మోటర్ సంస్థ ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి టి.ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. నగరంలోని టొయోట షోరూంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.



ఆర్‌డిఒ రవీంద్రరావు కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పంటలకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - నందిగామ : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల అధిక వర్షాల వల్ల వరదలు వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, కే గోపాల్ లు మాట్లాడారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - తిరువూరు : రైతులంతా నేల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, సమతుల ఎరువులు, పురుగు మందులు వాడుతూ మంచి దిగుబడులు పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. తిరువూరు మండలంలోని కాకర్ల గ్రామంలో జిల్లా శిక్షణా కేంద్రం, జిల్లా వనరుల కేంద్రం, విజయవాడ ఉప సంచాలకులు డి.మాధవీలత ఆధ్వర్యంలో శుక్రవా రం రైతులకు వరి, ప్రత్తి పంటలలో సమగ్ర పంట యాజ మాన్యం (నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం) గురించి వివరించారు. సహా య వ్యవసాయ సంచాలకులు జి.కెనడి లక్ష్మీపురం గ్రామంలో మేలైన వ్యవసాయ పద్ధతులు, పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశ్రాంత ప్రిన్సిపాల్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక ఎస్ ఆర్ వై ఎస్ పి జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఎస్సార్ వైఎస్ పి జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్ గా, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారిగా చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పరిష్కారం లభించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో అతిథులు విస్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డి చంద్రయ్య, పి ఉమా శంకర్ రెడ్డి వెంకటాచార్యుల నుండి నుండి ఆయన పురస్కారం స్వీకరించారు. సర్వేజనా సుఖినోభవంతు సంస్థ వ్యవస్థాపకులు లయన్ ఇ.ఎస్.సూర్యనారాయణ , ప్రధాన కార్యదర్శి ఇ.సూర్య తేజ శుభ్రాంత్ లు సాంబశివరావులు పురస్కారానికి ఎంపిక చేశారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు జిల్లా బిసి సంఘం లక్ష రూపాయలు విలువగల నిత్యావసర వస్తువులు అందించామని టిడిపి జిల్లా బిసి నాయకులు దేవరపల్లి కోటి అన్నారు. శుక్రవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని టిడిపి జిల్లా బిసి సంఘం కార్యాలయం వద్ద నుండి నందివాడ బుడమేరు ముంపు గ్రామాలైన తుమ్మలపల్లి, రామాపురం, గండేపూడిలలోని బాధితులకు ఉపయోగపడే లక్ష రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులను స్వయంగా వెళ్ళి టిడిపి బిసి జిల్లా నాయకుడు దేవరపల్లి కోటి ఆధ్వర్యంలో అందజేశారు. బిసి నాయకులు పామర్తి కోటయ్య, వికృతి సత్యం, కొక్కిరిపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పశువుల దాణా అందజేత

ప్రజాశక్తి-పెదపారుపూడి

మండలంలోని మోపర్రు గ్రామంలో పశుపోషకులకు తహసిల్దార్ రంగారావు, పశు వైద్యాధికారులు 126 కట్టల దాణాను శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు సిహెచ్ శ్రీనివాసరావు, పశు వైద్యులు జీవి నరసింహారావు, వెంట్రప్రగడ పశువైద్యులు వనిత, గ్రామ పెద్ద జూపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లోనూ అందుబాటులో బీమా క్లెయిమ్‌ల ఫెసిలిటేషన్ కేంద్రం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రం శని, ఆదివారాల్లోనూ పనిచేస్తుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో సెలవురోజులైన శని, ఆదివారాల్లో కూడా ఫెసిలిటేషన్ కేంద్రం పనిచేసేలా ఏర్పాట్లు చేశామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపార సముదాయాలు వంటి ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ఈ నెల 9 నుంచి నిరాంటకంగా సేవలందిస్తోందని, బీమా సంస్థల ప్రతినిధులు ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంటారన్నారు.

ఇబ్రహీంపట్నం ఆర్‌టిసి డిపో పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌ఎంయుఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఇబ్రహీంపట్నం డిపోలో పని చేస్తున్న వరదలలో పూర్తిగా నష్టపోయిన ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని ధైర్యం చెప్పి, వరదల్లో మునిగిపోయిన డిపోను సందర్శించి అన్ని సెక్షన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పివి.మోహన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎ.వి.శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ కుమార్, ఎంసి నెంబర్ అనంత రాములు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రామకష్ణ, సిసిఎస్ నెంబర్ ఎం.సుబ్బారావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు, గ్యారేజీ కమిటీ అత్యధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొని జరిగిన నష్టాన్ని వివరించారు.

ఐదు రోజులైనా లభ్యంకాని గోపిచంద్ ఆచూకీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మునేటిలో గల్లంతైన మాడుగుల గోపిచంద్ ఎలియాస్ చంటి మృతదేహం ఐదు రోజులైనా దొరకలేదు. బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నందిగామ శివారు పల్లగిరి సమీపంలో పెద్ద వంతెన (మున్నేరు పై) వద్ద గత ఐదు రోజుల క్రితం సోమవారం రోశయ్య, మాడుగుల గోపిచంద్ ఎలియాస్ చంటి ఇద్దరు పందెం కాసుకుని మున్నేరు నదిలోకి దూకారు. ఈ సంఘటనలో రోశయ్య ఈదుకుంటూ బయటకు రాగా, గోపిచంద్ ఎలియాస్ చంటి గల్లంతు అయ్యాడు. అప్పటి నుంచి నేటివరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఇప్పుటీ వరకు చంటి మతదేహం లభ్యం కాలేదు. అయితే శుక్రవారం నాడు తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు.

'నష్టానికి తగిన సాయం చేయాలి'

ప్రజాశక్తి - భవానీపురం :

వరదల వల్ల రాష్ట్రంలో పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, స్వయంగా వచ్చి వరద నష్టాన్ని చూసి రాష్ట్రానికి తగిన సాయం అందజేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శుక్రవారం లేఖ రాశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, వేల ఎకరాల పంటలు నష్టపోయాయని, వందల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఒక్క ప్రకాశం బ్యారేజ్ కాకుండా బుడమేరు, మున్నేరు వరదలు వల్ల గండ్లు పడి ప్రజలకు రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. రోజువారీ కూలీలు, చేతివృత్తుల వారు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక్కో ఇంటికి నష్టపరిహారం రూ.పది వేలు, రైతుకు ఎకరాకు రూ.పది వేలు ఇవ్వాలని చూస్తోందని రూ.యాభై వేలకు పెంచాలని కోరారు.

వరద బాధితుల ఆకలి దప్పికలు తీరుస్తూ...

ఆపన్న హస్తంగా ఆహార పంపిణీ కేంద్రాలు

ప్రజాశక్తి - విజయవాడ : సర్వం కోల్పోయి, వండుకోవడానికి వీలు లేని పరిస్థితుల్లో 'మీకు మేమున్నాము' అంటూ సిపిఎం, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు ముందుకు వచ్చి నిరంతరం వరద బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం పంపిణీ చేస్తున్నారు. నగరంలో నిర్వహిస్తున్న ఎనిమిది కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 70 వేల మందికి పైగా భోజన వసతి కల్పించారు.

సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా ఒక్కొక్క కేంద్రంలో 15 నుంచి 20 మంది వరకు రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతంలో పని చేస్తున్న వేలాది మంది పారిశుధ్య కార్మికుల దగ్గర నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద ఎత్తున ఈ ఆహార కేంద్రాల వద్దకు వచ్చి తమ ఆకలి, దప్పికలు తీర్చుకుంటున్నారు. ఎంబివికె సహకారంతో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ కేంద్రాలు నిరాఘాటంగా కొనసాగుతుండటం పట్ల సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, ఇతర ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

వరద బాధితుల ఆకలి తీర్చడం చాలా సంతోషంగా ఉంది : చింతల శ్రీనివాస్, సింగ్‌నగర్ (కృష్ణాహోల్ సెంటర్)



వరద బాధితులకు రోజూ అన్నం పెడుతూ, వారి ఆకలి తీర్చడం చాలా సంతోషంగా ఉంది. ఇళ్లు పూర్తిగా మునిగిపోయి, సర్వం కోల్పోయాం. అయితే ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాలని పార్టీ ఆదేశం మేరకు గత వారం రోజుల నుంచి నగరంలో ఎనిమిది కేంద్రాలను నడుపుతున్నాం.

ఒక వైపు సేవా కార్యక్రమాలు, మరో వైపు ఆకలి దప్పికలు తీర్చడం : షేక్ నిజాముద్దీన్, కృష్ణాహోల్ సెంటర్



ఆరు రోజులు వరద నీటిలోనే ఉన్నా. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఇతర సంఘాల నేతలు, కార్యకర్తలంగా బోటు తీసుకొని పెద్ద ఎత్తున వృద్ధులు, మహిళలు, పిల్లలు, వికలాంగులను బయటకు తరలించి వరద నుంచి కాపాడాం. 20 మంది వికలాంగులను, మరో 150 మంది పిల్లలను, వెయ్యి మంది ప్రజలను వరద నీటి ప్రమాదం నుంచి బయటకు తరలించాం.

ప్రతి ఒక్కరూ తృప్తిగా తింటున్నారు : టి ప్రవీణ్, పైపుల రోడ్డు సెంటర్



అప్పటి కప్పుడే వండిన అన్నం, రుచికరమైన కూరలతో భోజనం పెడుతుంటే ఆకలితో ఉన్న వరద బాధిత ప్రజలతో పాటు ఉద్యోగులు, ముఖ్యంగా శానిటేషన్ కార్మికులు, పోలీసు అధికారులు సైతం తృప్తిగా భోజనం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న భోజనం ప్యాకెట్లు పాడయిపోతూ నీరు కారిపోతూ తినడానికి వీలుగా ఉండటం లేదని ఉద్యోగులే బాధపడుతూ చెప్తున్నారు.

ఆహారం సప్లైలో ప్రభుత్వం విఫలం : వై.రాము : డివైఎఫ్ఐ స్టేట్ అధ్యక్షులు, పైపుల రోడ్డు సెంటర్



పెద్ద మొత్తంలో విరాళాలు వసూలు చేస్తూ...భారీ యంత్రాంగం ఉన్నప్పటికీ, మంత్రులు, అధికారుల మధ్య లోపించిన సమన్వయంతో వరద బాధితులకు ఆహారం సప్లై చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది. ప్రచారానికనుగుణంగా ప్రభుత్వం ఆచరణ లేకుండా పోయింది.



విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేట కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు (ఇన్‌సెట్లో) విజయవాడ వాంబేకాలనీ కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులతో సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు

వారు ఆకలి తెలిసినవారు : కోటా కళ్యాణ్, రాజీవ్‌నగర్ (ఉడాకాలనీ) సెంటర్



కేంద్రాలకు వచ్చే వేలాది మందికి వేడి-వేడి అన్నం, రుచికరమైన కూరలతో వరద బాధితుల ఆకలి తీరుస్తున్నారని, సిపిఎం వాళ్లకే అది సాధ్యమని బాధిత ప్రజల నుంచి వ్యక్తం అవుతుంది. తమకు ఎన్ని ఇబ్బందులు, ఆటంకాలు ఎదురయినా ప్రజల ఆకలి తీర్చడమే కర్తవ్యంగా పార్టీ ఇచ్చిన పిలుపుతో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నాం.

ఒక్క కేంద్రంలోనే రోజుకు ఐదు వేల మందికి భోజనం: షేక్ పీరుసాహెబ్, వాంబేకాలనీ, ఆహారం కేంద్రం



వాంబేకాలనీలో నిర్వహిస్తున్న ఆహారం పంపిణీ కేంద్రంలోనే ఒక్క రోజుకే ఐదు వేల మందికి పైగా రుచికరంగా భోజనం వడ్డిస్తునాం. రోజుకు రెండు క్వింటాళ్ల బియ్యం పడుతున్నాయి. ఈ స్థాయిలో వారం రోజుల నుంచి భోజనం పెడుతున్నాం.

వృత్తి పరికరాలు పంపిణీ



పరికరాలు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరంలో వరదల కారణంగా సెలూన్ షాపులు పూర్తిగా నీట మునిగి వృత్తి పరికరాలు కోల్పోయిన పేద వృత్తిదారులకు "న్యూస్" (నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్) అవసరమైన పనిముట్లు శుక్రవారం ఉదయం అందచేసింది. స్థానిక పాలఫ్యాక్టరీ వద్ద ఉన్న నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం. రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ విపత్తు నుండి బయటపడి సాధారణ జీవితం కొనసాగించాలంటే వత్తి పరికరాలు చాలా అవసరమని, అందుకే దాదాపు లక్షన్నర రూపాయల వ్యయంతో 120 మంది నాయి బ్రాహ్మణ వత్తిదారులకు పరికరాలు అందజేసినట్లు తెలిపారు. నష్టపోయిన వత్తిదారులకు రెండు కత్తెరలు, రెండు కత్తులు, ఒక ట్రిమ్మింగ్ మిషన్‌తో పాటుగా రెండు దువ్వెనలు, షేవింగ్ క్రీమ్ వంటి పరికరాలను అందజేశామని చెప్పారు. మెడికల్ ఎంప్లాయిమెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ మునుగోటి శ్రీనివాసరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్కాపురం కనకారావు, అన్నవరపు బ్రహ్మయ్య, న్యూస్ కోశాధికారి జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యూస్ సభ్యులు అందిస్తున్న ఆర్థిక సహాయంతోనే సేవా కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నట్లు తెలిపారు.

ఎంఎల్ఎను కలిసిన ట్రాఫిక్ ఎస్ఐ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ను నందిగామ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ శుక్రవారం కలిశారు. కాకాని నగర్ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంఎల్ఎ ను సన్మానించారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తిరువూరు : వివేకంతో ఆలోచించి వివాదాలకు దూరంగా ఉండాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ కక్షిదారులకు సూచించారు. వివిధ సమస్యల పరిష్కారానికి ఈనెల 14న కోర్టులో నిర్వహిస్తున్న మెగా లోక్ అదాలత్ కార్యక్రమంపై శుక్రవారం ఆయన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. మెగా లోక్ అదాలత్‌ను ప్రతి కక్షిదారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు



విధుల నుండి కార్మికురాలి తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఎటువంటి సమాచారం లేకుండా తొలగించడంతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకురాలు షేక్ మా జాన్ బి, హెల్పర్లు. శుక్రవారం ఉదయం పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి చిత్తశుద్ధితో పనిచేసే వారి పట్ల రాజకీయాలకు సంబంధం లేకుండా వారినే కొనసాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కవికాలమ్

ఏచూరికి అక్షర నివాళి

కర్షకుల కొడవలి
కన్నీరు కార్చింది.!
కార్మికుల శక్తి సుత్తి
సుతి మెత్తగా ఏడ్చింది.!!
శ్రమ జీవుల నక్షత్రం
వేదనతో రోదించింది..!!!
అన్ని రాజకీయ పార్టీలు
లాల్ సలాములు చెప్పాయి.!

సిపిఎం జాతీయ రథ సారథి
అరుణ పతాక వస్త్ర ధారి
ఉద్యమాలకు కొత్త ఊపిరి
కామ్రేడ్ సీతారాం ఏచూరి..!
భౌతికంగా మనకు దూరమైనాడు..!
జనత గుండెలో జయ గీతమయ్యాడు
ఉదయకాల అరుణతారగా మారి
మిన్నులో కేతనమై మెరిశాడు..!

జి.సూర్యనారాయణ, దివిసీమ